

# కథా కౌముది

## కొన్నతల్లి

రమేష్ బోడపాటి

. "అభినందనలు రావు గారూ మీరు తండ్రయినందుకు."

"చాలాబావున్నాడు. ఇంతకీ పేరేం పెట్టారు అబ్బాయికి?"

"వినూత్ " అన్నాడు రావు గర్వంగా.

"పేరు కూడా కొత్త గానే ఉంది."

"మాలతి గారూ మీకు తల్లి కళ వచ్చేసింది" అంటున్నారు ఆయన భార్యని.

'తల్లి కళ 'నవ్వుకుంది మాలతి.

అయితే అది ఆలోచించే సమయం కాదు. వచ్చిన అతిధులకు మర్యాద చేయటంలో నిమగ్నమయ్యింది.

ఆ రోజున మాలతి రావు దంపతుల కుమారుడు' వినూత్ ' నామకరణం సందర్భంగా ఏర్పాటూ చేసిన విందు కార్యక్రమం జరుగుతోంది.

నామకరణం ఇంట్లోనే జరిగిపోయినా భోజనాలు మాత్రం పెద్ద హోటల్లో ఏర్పాటు చేసారు, రావు గారి పరపతి,హోదాకు తగినట్లుగా. ఊళ్ళో ప్రముఖులంతా వచ్చేసారు. రాకపోతే అనుమానం, ఆ పై అవమానం!!

ఒకాయన మైకు అందుకుని

“రావు గారికి మనందరి తరఫున అభినందనలు తెలియచేస్తున్నాను. ఇది ఆయన కుటుంబమే కాదు మనందరమూ ఆనందించాల్సిన సమయం. వివాహమయి చాలా కాలమైనా వీరికి ఇంతవరకూ సంతానం కలగలేదు. ఇన్నాళ్ళకు దేవుడు కరుణించాడు.ఆయన వ్యాపారానికి వారసుడు దొరికాడు.అందుకు ఆయన భార్య మాలతి గారిని ప్రత్యేకంగా అభినందించాలి ."

అందరూ చప్పట్లు కొట్టారు.

ఇటువంటి ఉపన్యాసాలు కొన్ని అయిన తర్వాత రావు మాట్లాడుతూ

"మా ఆహ్వానాన్నిమన్నించి విచ్చేసిన మీ అందరికీ ధన్యవాదాలు. ఇది మా జీవితంలో మధురమైన రోజు.మాకు వివాహమై చాలా సంవత్సరాలు గడిచినా సంతానం కలగలేదు. మేము కలవని వైద్యుడు లేడు. చేయని పూజ లేదు.దేవుని దయలేదని సరిపెట్టుకున్నాం.ఎవరి నయినా పెంచుకుందామనుకున్నాబంధువుల పిల్లలయితే కొత్త సమస్యలు వస్తాయి. అనాధ పిల్లలను తెచ్చి పెంచుకోవటానికి .....ఉహూ ... అనుకున్నాము."

అందరూ ఆసక్తిగా వింటున్నారు.

"ఈ మధ్యనే ప్రచారం, ఆదరణ పొందుతున్న సరొగసీ వైద్య విధానం మా దృష్టికి వచ్చింది. వైద్యుల సలహా మీద ఈ పద్ధతిని అనుసరించాము.నా వీర్యాన్ని ఒక అజ్ఞాతస్త్రీ లో ప్రవేశపెట్టి వైద్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం పూర్తి చేసాం. దాని ఫలితమే ఈ వినూత్. దీనికి చాలా ఖర్చయిందనుకోండి.అయినా నా రక్తం, నా వారసుడు. అదే నాకు కావలసింది."”

ఆయన మాటల్లో దర్పం,అహంకారం డబ్బుతో దేన్నయినా సాధించవచ్చనే అహంభావం అందరూ గమనించారు.

"అమ్మగారూ బాబు ఏడుస్తున్నాడు."అన్న నర్స్ మాట వినబడి ' బాబు ' అనుకుంటూ మాలతి ఆ పసివాణ్ణి ఎత్తుకుంది.

అలవాటు పడుతున్న స్పర్శకు ఏడుపు మానేసాడు.నర్స్ తెచ్చిన పాలసీసా అతని నోట్లో పెట్టింది. ఆకలి తీరి కిలకిలా నవ్వుతున్నాడు.

భోజనాలు పూర్తి చేసి అందరూ వెళ్ళి పోయారు.

"మనబ్బాయిని అందరూ మెచ్చుకున్నారు" అన్నాడు రావు తృప్తిగా.

మాలతి నిర్లిప్తంగా నవ్వుకుంది.

అవునని తల ఊపినా ఏదో అసంతృప్తి ఆమె మనసులో చోటు చేసుకుంటోంది.

రోజులు గడుస్తున్నాయి. పసివాడు వయసుకు తగ్గట్లుగా పెరుగుతున్నాడు.పోషణలో లోపం లేదు.ఇప్పుడిప్పుడే చిన్నచిన్న మాటలు వస్తున్నాయి.

"అమ్మ" అంటూ మాలతిని చూపించాడు రావు.

'నేను అమ్మను కాను' అనుకుంటోంది మాలతి.

సాధారణంగా తల్లి' నాన్న' అంటూ తన భర్తను సంతానానికి పరిచయం చేస్తుంది.ఇక్కడ తండ్రి 'అమ్మ' అంటూ తన భార్యను పరిచయంచేస్తున్నాడు. ఇదొక విచిత్రం.

"అబ్బాయికి డ్రస్సులు కొందాం రావోయ్" అన్నాడు ఒక సాయంత్రం.

"నేను రాను. మీరే వెళ్ళండి."

“అదేమిటి. బట్టల సెలక్షన్ ఎప్పుడూ నీదే కదా. నువ్వు ఎంచేవి చాలా బాగుంటాయని మా వాళ్ళందరూ తెగ మెచ్చుకుంటారు. మరి మనబ్బాయి దగ్గర కొచ్చేసరికి రాననంటావేం."

అతనే కొడుకుని తీసుకుని వెళ్ళిపోయాడు.

'చూడు ఎన్ని కొన్నానో' అంటూ సంబరంగా చూపించాడు.

మాలతి నవ్వి ఊరుకుంది. తను ఇష్టపడి కొన్న బట్టలు భర్తకు చూపించి మురిసిపోయిన రోజులు గుర్తొచ్చాయి

ఇంకొక రోజు కారులో బయలుదేరారు..తను వెనక సీట్లో కూర్చుంది.

"అదేమిటి ఎప్పుడూ ముందు సీట్లోనే కదా నువ్వు కూర్చునేది. అయినా పిల్లాడు ఒక్కడూ కూర్చోలేడు. నువ్వు ముందుకురా."

"ఫరవాలేదు. అయినా మీరున్నారు కదా" అన్నదే కానీ ముందు సీట్లోకి మారలేదు.

వచ్చీరాని ఊహలతోఉన్న పిల్లాడు డైనింగ్ టేబుల్ మీద వంటకాలను చిందరవందర చేసేస్తున్నాడు.

'అదేంటి కాస్త అన్నం కలిపి పెట్టవచ్చు కదా' అని కసురుకున్నాడు.

మాలతి తనకేం పట్టనట్లుగా భోంచేసింది..

రావుకు ఆమె ప్రవర్తన వింతగా అనిపించటం మొదలయింది.

పడక గదిలో కూడా ఆమె ధోరణి అర్థం కావటం లేదు.

వినూత్ తండ్రిని కరుచుకుని నిద్ర పోతాడు.తల్లి మీద చేయి వేసినా ఆమె తీసివేయటంతో తండ్రి దగ్గరే మాలిమి ఎక్కువవుతోంది.

పిల్లవాడు నిద్ర పోయిన తర్వాత అతన్ని మంచానికి ఒక వైపుకు జరిపి దొర్లిపడకుండా జాగ్రత్తలు తీసుకుని భార్య మీద చేయి వేశాడు. ఆమె విసిరికొట్టింది.

"ఏం వంట్లో బాగా లేదా"అన్నాడు ఆదుర్దాగా.

"అదేం లేదు."

"మరి?"

భార్యను తన వైపుకు తిప్పుకున్నాడు.ఆమె కళ్ళంబడి నీళ్ళొస్తున్నాయి.

"ఏమయింది .ఎవరైనా ఏమైనా అన్నారా."

" .. .."

"ఇదివరకు జీవితంలో చాలా వెలితిగా ఉండేది.ఇప్పుడు మన జీవితంలోకి వెలుగొచ్చింది. నీకు గుర్తుంది కదా .పిల్లలు పుట్టటంలేదని మధన పడుతూ మనం ఎన్నోరాత్రులు నిద్ర పట్టకుండా గడిపేవాళ్ళం. కానీ ఇప్పుడు ఆ దిగులు తీరిపోయింది. మన జీవితాల్లోకి కొత్త వెలుగొచ్చింది.ఇక మనకు పిల్లలు పుట్టలేదనే చింత లేదు."

"అవును లెండి. మీరు సంపాదించుకోగలరు".

"సంపాయించుకోవటం ఏమిటి. నువ్వేం మాట్లాడుతున్నావో తెలుస్తోందా".

"నాకు బాగానే తెలుస్తోంది. నా దురదృష్టం మీకే అర్థం కావటం లేదు".

"వింతగా మాట్లాడుతున్నావివాళ.నేనెవరిని ".

"మీ బిడ్డకు తండ్రి.."

"అంటే నీకేం కానా?".

"నా భర్త హోదా కూడా ఉంది".

"హోదా ఏమిటి. ఇదేమైనా పదవా అధికారమా.! చాలా విడ్డూరం గా ఉంది."

"మీ చేతల్లాగే ఉంటాయి, నా మాటలు కూడా."

ఆమెకు దు:ఖం ఆగటం లేదు. అతనికి కారణం అంతు పట్టటం లేదు.

"మనకు పిల్లలు పుట్టే అవకాశం లేదని డాక్టర్లు చెప్పినప్పుడు నాకు చాలా బాధేసింది. ఎవరినయినా పెంచుకుందామంటే మీరొప్పుకోలేదు."

"అవును.ఎవరికో పుట్టిన బిడ్డను పెంచుకోవటం నా కిష్టం లేదు."

"మరి ఈ పిల్లాడు?"

"ఏం మాట్లాడుతున్నావ్.నేను ఈ బిడ్డకు తండ్రిని."

"కానీ తల్లెవరో తెలీదు కదా."

మాలతికి నవ్వొచ్చింది , అంత దు:ఖంలోనూ.

"నా రక్తం నా వారసుడని ఘనంగా చెప్పుకున్నారు, అందరూ మెచ్చుకున్నారు కూడా."అన్నది.

రావు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. విషయం ఎటు మళ్ళుతుందో అర్థం కావటం లేదు.

"ఇదివరకు ఎవరికైనా సంతానం కలగకపోతే ఆడదానిలోనే ఏదో లోపం ఉందనీ, గొడ్రాలని ముద్ర వేసి మగవాడికి మళ్ళీ పెళ్ళి చేసేవాళ్ళు. లేదా అతను ఎవరితో నైనా ...."

దు:ఖం ఆపుకోలేకపోయింది .రావు ఆమె భుజం మీద చేయి వేసాడు.

"నాలో లోపం ఉందని, సంతానం సంపాదించుకుని, శ్రమ పెట్టకుండా నాకు తల్లి హోదా కల్పించారు. చాలా సంతోషం. కానీ' అమ్మా' అని ఆ పిల్లాడు పిలుస్తున్నా నాలో ఎటువంటి స్పందనా కలగటం లేదు.

మాట వరసకి అంటున్నాను. ఒక వేళ నేను సంపూర్ణ ఆరోగ్యంతో ఉండి మీలో లోపం వల్ల మనకు పిల్లలు పుట్టే అవకాశం లేకపోతే........"

"ఎవరినయినా తెచ్చి పెంచుకుంటాం"

"ఎంత తేలిగ్గా చెప్పారండి. నాలో లోపం ఉండి మీరు ఏదో రకంగా తండ్రయితే ఘనం. మరి మేం కూడా ఎవరి ద్వారానో పిల్లల్ని కంటే."

"ఛ అదెలా కుదురుతుంది. ఎవరితోనో...."

"ఊ.ఎవరితో నో .. అనండి. ఆగారేం. మేమూ ఎవరితోనూ సంబంధం పెట్టుకోము. అసలు వాళ్ళెవరో కూడా మాకు తెలీదు.కేవలం దాక్టర్లకే తెలుస్తుంది, మీ విషయం లో జరిగినట్టే. భార్యాభర్తలంటే ఒకరినొకరు ఇష్టపడి పెళ్ళి చేసుకున్న జంట. వారిలో ఒకరి లోపాన్ని రెండవవారు అంగీకరించాలి.

నాకు మీ అబ్బాయిని చూసినప్పుడల్లా నా లోపమే నన్ను వెక్కిరిస్తున్నట్లుంటుంది.మీరు సంపాదించుకున్న.... సంపాదించుకున్న అని ఎందుకంటున్నానంటే మీరు పెట్టే కొత్త ఫాక్టరీ, కొత్త వ్యాపారం లాంటిదే ఈ సంతానం కూడా.

తల్లిదండ్రు లెవరో తెలియని అనాధని పెంచుకోవటానికి ఇష్టపడని మీరు ముక్కూ మొఖం తెలియని ఒక ఆడదాన్ని తల్లిని చేయటానికి సిద్ధ పడ్డారు. మీ సరుకు దాచుకునే గోడౌన్ చేశారు. పచ్చిగా చెపితే క్షమించండి. ఏ జన్మలో చేసిన పాపమో ఈ జన్మలో మనకు సంతానం లేకుండా పోయింది. నవ మాసాలూ మోసి జన్మ నిచ్చిన తల్లి నుండి బిడ్డనువేరు చేసి మళ్ళీ పాపం మూట కట్టుకోవద్దు. నా మీద ఏమాత్రం ప్రేమ ఉన్నా ఈ అబ్బాయిని కన్న తల్లికి అప్పచెప్పండి. వాడి పోషణ భారం మనమే వహిద్దాం. కానీ వాడు మాత్రం ఈ ఇంట్లో ఉండటానికి వీలు లేదు. "అన్నది స్థిరంగా

. మాలతి ముఖంలో ప్రశాంతత. మరి రావు ..??

★★★

**Click here to share your comments on this story**